క్లుప్తంగా

అన్నదానం

హన్మకొండ: భద్రకాళి వీరభద్ర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతీ అమావాస్య రోజు అన్నదానం చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి, సీనియర్ పాత్రికేయుడు పిన్న శివకుమార్ అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హెడ్‌పోస్టాఫీస్ వద్ద భద్రకాళి వీరభద్ర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమాన్ని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు దాసరి కృష్ణారెడ్డి, సీనియర్ పాత్రికేయుడు మండువ రవీందర్ ప్రారంభించారు. శివకుమార్ మాట్లాడుతూ 300 మందికి పైగా అన్నదానం చేసినట్లు తెలిపారు. ప్రెస్ ఇన్ఫర్‌మేషన్ బ్యూరో అధికారి శ్రీధర్, సీనియర్ పాత్రికేయులు వెంకటరమణ, రాజేష్ వర్మ, విష్ణువర్ధన్, దిలీప్, మహేష్, శ్రీధర్, రాంమోహన్ పాల్గొన్నారు.

ముగిసిన సమాధుల పండుగ

కాజీపేట : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు కుటుంబాల సభ్యులు మృతి చెందిన వారి జ్ఞాపకార్థం పెద్దల పండుగను శుక్రవారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. పెద్దలు, చిన్నలను స్మరించుకుంటూ కాజీపేటలో ఉన్న పలు శ్మశాన వాటికల్లో ఉన్న సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక అలంకరణలు చేశారు. కార్యక్రమంలో మర్యాల కృష్ణ, రవీందర్, బి.వినయ్, రసూల్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



మడికొండ: చిన్ననాటి స్నేహితురాలి కుమారుడికి అనారోగ్యంతో అస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న 2003–04 పదో తరగతి క్లాస్‌మెట్స్ తోటి స్నేహితురాలికి తమ వంతుగా ఆర్థికసాయం రూ.25వేలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరుకు వెళ్లి అందజేశారు. స్నేహితురాలు స్రవంతి కుమారుడి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మీకు మేము అండగా ఉంటామని భరో కల్పించారు. స్నేహితులు ఆర్థికసాయం చేయడంతో స్రవంతి కృతజ్ఞతలు తెలిపారు.

6న జిల్లాస్థాయి క్విజ్‌పోటీలు

విద్యారణ్యపురి: భారత వికాస్ పరిషత్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో భారత్ కోజానో క్విజ్ పేరిట జిల్లా స్థాయి పోటీలను ఈనెల 6న నిర్వహించనున్నట్లు బీవీప జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్విజ్ పోటీలను హనుమకొండలోని సేయింట్ పీటర్స్ స్కూల్‌లో నిర్వహించబోతున్నామన్నారు. ఈ పోటీలు జూనియర్స్ విభాగంలో 6 నుంచి 8 తరగతి విద్యార్థులకు, సీనియర్స్ విభాగంలో 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్నామన్నారు. గ్రేటర్ పరిధిలోని పాఠశాలల నుంచి ప్రతి విభాగంలో ఇద్దరి విద్యార్థుల చొప్పున ఎంపిక చేసి జిల్లాస్థాయి క్విజ్‌పోటీలకు పంపాలని వారు కోరారు. పోటీల్లో వారు ఈనెల 4లోగా పోటీల కన్వీనర్ వివేకానంద 9000001196 సెల్ నంబర్‌కు పంపాల్సిందిగా వారు కోరారు.

ఆటంకం కలిగించొద్దు

విద్యారణ్యపురి: కుల గణన విధులను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకే కేటాయించడాన్ని ఖండిస్తున్నామని అన్ని రకాల పాఠశాలల్లోని అధికంగా ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి విధులను కేటయించాలని, అంతేగాకుండా పాఠశాలల పనివేళలకు ఆటంకం కలిగించకూడదని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉదయం 9 నుంచి పాఠశాల విధులను నిర్వర్తించి మధ్యాహ్న భోజనం పెట్టించి తర్వాత సెన్సెస్ విధులకు హాజరు కావాలనడం మధ్యాహ్నం సర్వేకు వెళితే ఇళ్లలో ఎవరూ ఉండరన్నారు. ఉదయం సర్వే నిర్వహించి మధ్యాహ్నం పాఠశాలలు నిర్వహించేలా ఉత్తర్వులను సవరించి విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన టీఎన్జీఓ నాయకులు

కాజీపేట: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని టీఎన్జీఓ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు శాలువ కప్పి సన్మానించారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, మోయిజ్, లక్ష్మిప్రసాద్, చీకటి శ్రీనివాస్ ఉన్నారు.

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

మడికొండ : మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు శనివారం నుంచి ఆలయంలో ప్రారంభం కానున్నట్లు ఈఓ శేషభారతి పేర్కొన్నారు. సాయంకాలం ప్రతీ రోజు హరిహరులకు ఆకాశ దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు గోత్రనామాలతో అభిషేకం చేయించుకోదలచిన వారు రూ.1,116 అలాగే రామాలయంలో గోత్రనామలతో అర్చన చేయించదలచిన వారు రూ.1,016లు చెల్లించి రశీదు పొందాలని ఆమె సూచించారు.

ఘనంగా దీపావళి వేడుకలు

దీపావళి పండుగను గురు, శుక్రవారం రెండు రోజులు అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. గ్రేటర్ పరిధిలోని పలు డివిజన్లతో పాటు విలీన గ్రామాల్లో ప్రజలు చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా ముంగిళ్లలో మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించారు. చిన్నారుల కేరింతలతో దీపావళి సంబరాలు మిన్నంటాయి. దీంతో ఇంటింటా దీపావళి శోభ సంతరించుకుంది. వరంగల్ ఉర్సులోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్కూల్ చైర్మన్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో డైరెక్టర్లు వరుణ్, వైష్ణవి నేతృత్వంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వరంగల్‌లో మేయర్ గుండు సుధారాణి దంపతులు కేదారేశ్వర వ్రతం చేశారు.

– సాక్షి,నెట్‌వర్క్



కాజీపేట అర్బన్: వ్యాస ఆవాసంలో క్రాకర్స్ కాలుస్తున్న విద్యార్థులు



కేదారేశ్వర వ్రతంలో మేయర్ దంపతులు



నయీంనగర్ : ఏకశిల హైస్కూల్‌లో..



ఖిలావరంగల్ : తాళ్ల పద్మావతి స్కూల్‌లో ప్రత్యేక వేషధారణలో విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

- శాస్త్రీయ నృత్యంలో యజ్ఞశ్రీ జాతీయ స్థాయికి ఎంపిక

విద్యారణ్యపురి/హన్మకొండ కల్చరల్ : హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పారామంలో శుక్రవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి కళాఉత్సవ పోటీల్లో హనుమకొండ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చాటారు. సాంప్రదాయ నృత్యమైన కూచిపూడి పోటీలో హనుమకొండ జిల్లా నుంచి పాల్గొన్న యజ్ఞశ్రీ అత్యుత్తమ ప్రదర్శన చేసి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి నృత్యపోటీలకు ఎంపికైంది. యజ్ఞశ్రీ హనుమకొండలోని సేయింట్ పీటర్స్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతుంది. అలాగే జిల్లాకు చెందిన దివ్య వెంకటరామన్ గాత్ర సంగీతలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించింది. ఈమె సేయింట్ గాబ్రియల్‌లో పదో తరగతి చదువుతుంది. వీరిద్దరిని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ప్రశంసించి బహుమతులు ప్రదానం చేశారు. యజ్ఞశ్రీ జాతీయస్థాయికి ఎంపికవడంపై డీఈఓ వాసంతి, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ అభినందించారు. అలాగే దివ్యవెంకటరామన్‌ను కూడా అభినందించారు.



యజ్ఞశ్రీకి ప్రశంసపత్రం అందజేస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి

డీఎంహెచ్ఓకు అభినందనల వెల్లువ



ఎంజీఎం : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు హనుమకొండ డీఎంహెచ్ఓగా బాధ్యతలు స్వీకరించిన అప్పయ్యకు శుక్రవారం పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శీలగాని రాజ్‌కుమార్, ఇమ్మడి బాబు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు

మడికొండ: రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం కాజీపేట మండలం టేకులగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర అయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం త్వరలోనే సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ జరుగుతుందని ఎవరూ అధైర్యపడకూడదన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా 8096107107 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలుపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాం నర్సింహరెడ్డి, దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్, మండల మహిళా అధ్యక్షురాలు నీలం రజిని వేణుయాదవ్, 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, గ్రామపార్టీ అధ్యక్షుడు శివరాజ్, రైతులు, పాల్గొన్నారు.



ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, జంగా రాఘవరెడ్డి

భీమారంలో ఆఫ్ రోడింగ్ ప్రదర్శన



హసన్‌పర్తి : మండలంలోని భీమారం శివారులో ఆఫ్–రోడింగ్ ప్రదర్శన ఆదివారం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమం చైర్మన్ సయ్యద్ భక్తియార్ తెలిపారు. భీమారంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిసారిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతోందన్నారు. ఎనిమిది దశల్లో ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. నైపుణ్యం గల డ్రైవర్లతో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలో 20 వాహనాలు వినియోగిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కార్యక్రమం కన్వీనర్ త్రిలోక్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణనతో బీసీలకు న్యాయం

- పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మల్లేశ్వర్

కేయూ క్యాంపస్: సమగ్ర కులగణనతోనే బీసీలకు న్యాయం జరగుతుందని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలోని జర్నలిజం విభాగంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ పదవులు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ సామాజిక న్యాయ సమగ్ర కులగణన ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈ సర్వే శాస్త్రీయంగా అధ్యయనం, గణంకాలను చేయాలని అప్పుడే ఈడబ్ల్యూఎస్‌లోని పేదలకు , బీసీ ఎంబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం జరిగేందుకు ఈ సర్వే దోహద పడుతుందన్నారు. సమావేశంలో పాస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తాడూరి శాస్త్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, బాధ్యులు డాక్టర్ కొట్టే భాస్కర్, బిక్కు న్యాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సంగని మల్లేశ్వర్

కుల గణనను స్వాగతిస్తున్నాం

హన్మకొండ : రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనను స్వాగతిస్తున్నామని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్ రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టడం ద్వారా రాష్ట్రంలో బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి స్థాయిలను తెలుసుకోగలుగుతామన్నారు. సమావేశంలో బీసీ నాయకులు దార బోయిన సతీష్, పిట్టల శ్రీనివాస్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల గర్జనను విజయవంతం చేయాలి



వరంగల్ : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

వరంగల్/నయీంనగర్: ఈనెల 3న వరంగల్‌లో నిర్వహిస్తున్న 'ఉద్యమకారుల గర్జన సభను విజయవంతం చేయాలని' బీసీ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మపురి రామారావు,తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర చైర్మన్ గోధుమల కుమారస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం హంటర్‌రోడ్‌లో 'ఛలో వరంగల్...ఉద్యమకారుల గర్జనసభ పోస్టర్లను రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969 నుంచి ఇప్పటివరకు తెలంగాణలోని నిరుద్యోగులకు, రైతులకు, ప్రజలకు కష్టాలే మిగిలాయని.. ఎన్ని ఉద్యమాలు చేసినా కూడా ఉద్యోగాలలో గాని, నీళ్లలో గాని, నిధులలో గాని, సంపదలో గాని బీసీ, ఎస్సీ, ఎస్టీ సబ్బండ వర్గాలకు ఏమి దక్కలేదన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జరిగే గర్జన సభకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ బహుజన సంఘం నాయకులు అల్లి అజయ్ బాబు, రుద్రోజు నవీన్ , నాగరాజు గౌడ్ , శ్రీనివాస్, నగేష్, శివలు,తెలంగాణ ఉద్యమకారుల జాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి శ్రీనివాస్, కన్వీనర్ సోమ రామమూర్తి, ఓబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి



ఎన్యుమరేటర్ల శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ జోనా

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 6 నుంచి 18 వరకు నిర్వహించనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వేలను సమర్థవంతంగా నిర్వహించాలని సమగ్ర వివరాలతో చేపట్టాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అన్నారు. సర్వేను నిర్వహించనున్న నేపథ్యంలో వరంగల్ బల్దియా (కాశిబుగ్గ సర్కిల్) వార్డుల్లో సర్వే నిర్వహించే ఎన్యుమనేటర్లకు పోచమ్మమైదాన్ అబ్బాస్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో పాల్గొని తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు సర్వేలో పాల్గొనే ఎన్యుమనేటర్లకు శిక్షణ అందిస్తున్నామని, ఇందుకోసం ఎంపికైన మున్సిపల్ సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మున్సిపల్ బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆర్‌ఓలు షహజాది బేగం, శ్రీనివాస్ సూపరింటెండెంట్ హబీబ్, టీఎంసీ రమేష్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి

హసన్‌పర్తి: రైతులు తమ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని డీఈ సామ్యానాయక్ సూచించారు. చింతగట్టు టౌన్ సబ్‌స్టేషన్ పరిధిలోని శుక్రవారం 'పొలం బాట' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లూజ్‌లైన్స్ కోసం మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయాలని రైతులు సూచించారు.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి



హన్మకొండ: తెలంగాణలో జరిగిన అణచివేతపై వీరోచిత పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం త్యాగపూరిత పోరాటాలు చేసిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి అన్ని విధాలా ఆదుకోవాలని అల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ డిమాండ్ చేశారు. ఈ నెల 3న తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక సభ పోస్టర్‌ను శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు, ఉద్యమకారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్ రావు, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర చైర్మన్ గోధుమల కుమారస్వామి, ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక వరంగల్ జిల్లా కన్వీనర్ కొండ్ర నర్సింగరావు, పాల్గొన్నారు.

మెస్‌చార్జీల పెంపుపై హర్షం

విద్యారణ్యపురి/ఖిలావరంగల్/హన్మకొండ కల్చరల్ : డైట్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంపై తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు రౌతు అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండలో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలోఆయన పాల్గొని మాట్లాడారు. మెస్‌చార్జీలు పెంపుతో హాస్టల్స్ విద్యార్థులకు మరింతగా నాణ్యమైన భోజనం అందించే అవకాశం కలిగిందన్నారు. వరంగల్ ఉర్సుగుట్ట జ్యోతి బాపూలే పాఠశాలలో, ఖిలావరంగల్ మండలం మామునూరులోని జ్యోతిబాపూలే బీసీ గురుకులం (బాయ్స్)లో విద్యార్థులు పాఠశాలలో కేకులు కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేసుకుని సంబురాలు జరుపుకున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

విద్యారణ్యపురి: భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్వీప్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారాగాని బీఎల్‌ఓ ద్వారాగాని ఫారం 6 ద్వారా గాని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

భారీ వాహనాలు రాకుండా కమాన్ ఏర్పాటు



మడికొండ : గత కొద్ది నెలలుగా భారీ వాహనాలతో మడికొండ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని ప్రమాదాలకు గురయ్యారు. గ్రామస్తులు ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యే నాగరాజు అదేశాల మేరకు శుక్రవారం భారీ వాహనాలు వెళ్లకుండా మడికొండ చౌరస్తాలో, పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద ఆర్చి(కమాన్) ఏర్పాటు చేశారు. పలువురు గ్రామస్తులు పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ దృష్టికి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా భారీ వాహనాలు రాకుండా కమాన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో శుక్రవారం ఏర్పాటు చేశారు. సీపీకి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయం నిర్మించాలి



హన్మకొండ కల్చరల్ : ఇటీవల తవ్వకాల్లో పెద్దమ్మ తల్లి దేవత విగ్రహం బయటపటిన చోట ఆలయాన్ని నిర్మించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు వరంగల్ ములుగుక్రాస్ రోడ్డు సమీపంలో నిర్వహించిన తవ్వకాల్లో బయటపడిన పెద్దమ్మతల్లి విగ్రహాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మెపా రాష్ట్ర నాయకులు రాజు, చిరంజీవి, సింగారపు రామకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా !

హసన్‌పర్తి : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నారు. ఆయన బాటలో మరికొంత మంది నాయకులు పయనించనున్నట్లు తెలిసింది. చింతగట్టు సమీపంలోని ఓ ఇంట్లో కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశం జరిగినట్లు తెలిసింది. ఇందులో పలు విషయాలు ప్రస్తావించినట్లు సమాచారం. కాంగ్రెస్‌లో కీలకమైన వ్యక్తులకు గుర్తింపు ఇవ్వడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. స్థానిక ఎమ్మెల్యే మండలంలో జరిగే కార్యక్రమాలకు సమాచారం ఇవ్వకపోవడమే కాకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆహ్వానించిన కార్యక్రమాలకు వెళ్లడం వల్ల ఉనికి కోల్పోతున్నామని విషయాలను చర్చించినట్లు సమాచారం. ఒకటిరెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. మండలంలో పార్టీకి భారీ దెబ్బపడే అవకాశం ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

శ్మశానవాటిక వద్ద నూతన బోరు ప్రారంభం

వరంగల్ : నగరంలోని 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లోని శ్మశానవాటిక వద్ద నూతనంగా వేసిన బోరును స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన శుక్రవారం ప్రారంభించారు. శ్మశాన వాటిక వద్ద నీటి సౌకర్యం లేకపోవడంతో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వెంటనే నిధులు మంజూరు చేయించి కొత్త బోరు వేయించారు.

అధికారులను కలిసిన రైల్వే ఎస్సీ, ఎస్టీ నేతలు



కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ముఖ్య విభాగాల అధికారులను శుక్రవారం రైల్వే ఎస్సీ, ఎస్టీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. మేనేజర్‌గా అగ్గి రవీందర్, రైల్వే ఏరియా ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజీవ్‌చౌదరి, కాజీపేట రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ.కె.అల్వర్‌లను కాజీపేట రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆపరేటింగ్ అండ్ కమర్షియల్ బ్రాంచి సెక్రెటరీ అండ్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కె.ఎస్.రావు, కట్కూరి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాస్, సుమన్, మోతీలాల్ సన్మానించారు.

స్వెటర్ మార్కెట్ ప్రారంభం

నయీంనగర్: హనుమకొండ అశోకా హోటల్ ఎదురుగా పాత మున్సిపాలిటీ గ్రౌండ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన నేపాలి టిబెట్ స్వెటర్ మార్కెట్ ఎగ్జిబిషన్‌ను గురువారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా శీతాకాలం ప్రారంభ దశ నుండి మార్చి వరకు నగర ప్రజలకు ఉలెన్‌తో తయారుచేసిన వివిధ రకాల దుస్తులను సరసమైన ధరలకు అందించడం పట్ల వారిని అభినందించారు.

కార్తీక మాసోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి రోడ్‌లోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్తసేవాశ్రమంలో కార్తీకమాసోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు టీఆర్ బాలసుబ్రమణ్యశర్మ, నిర్వహక అర్చకులు గణపతిశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్తీకమాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణపతిశర్మ మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేకపూజలు జరుగుతాయని, శబరిమల మండలదీక్ష జ్యోతి దర్శనానికి మాల వేసుకునే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని అన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి



హన్మకొండ చౌరస్తా: జనగణనలో కుల గణన చేయాలని, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాం అన్నారు. శనివారం హనుమకొండ కలెక్టర్ ఆఫీసుకు రానున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులకు ఘనస్వాగత ఏర్పాట్లపై గురువారం రెడ్డికాలనీలోని బీసీ సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్యాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కమిషన్ నియమించకుండా ఏర్పాటు చేసిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 29ని సైతం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం లో వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు రాజు, రమేష్, మల్లేషం, నాగరాజు పాల్గొన్నారు.

భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఖిలా వరంగల్: భూర్జువా, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మానవ హక్కుల వేదిక జిల్లా నేత బండి కోటేశ్వర్‌రావు, ఐఎఫ్‌టీయూ జిల్లా నేత గంగుల దయాకర్ పిలుపునిచ్చారు. నవంబర్ 1 నుంచి 9 వరకు జరగే అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఖిలావరంగల్ పడమరకోట అమరవీ స్తూపం వద్ద సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో అమరవీరుల సంతాప సభ జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై అమరవీరులకు నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నేతలు బన్న నర్సింగం, హరిబాబు, ప్రభాకర్‌రాజు, కృష్ణ, అక్బర్, రవి, కుమారస్వామి పాల్గొన్నారు.

సర్దార్ ఆశయాలు కొనసాగించాలి



హసన్‌పర్తి: సర్దార్ వల్లాభాయ్ పటేల్ ఆశయాలు కొనసాగించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్‌లో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశ ఐక్యమత్యాన్ని,దేశ సమగ్రత కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాశిబుగ్గ : నిజాం మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేసిన నాయకుడు సర్దార్ వల్లాభాయ్ పటేల్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ అన్నారు. గురువారం భారత తొలి ఉపప్రధాని సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి వేడుకలు వెంకట్రామ జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు వేర్వేరుగా పటేల్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ వెంకటరమణ, సముద్రాల పరమేశ్వర్, రత్నం సతీష్‌షా, రఘునారెడ్డి, రంజిత్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, రమేష్, లాజర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.